క్లుప్తంగా

ఉపాధి కూలీలు సురక్ష బీమా చేయించుకోండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ శేషన్న

బేతంచెర్ల: ఉపాధి కూలీలు ప్రధాన మంత్రి సురక్ష బీమా చేయించుకోవాలని ఏపీఓ శేషన్న సూచించారు. బుధవారం మండలపరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం, రహిమానుపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద కూలీలు తమ బ్యాంకు ఖాతాకు రూ. 20 చెల్లించినట్లయితే ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 2లక్షలు, పూర్తి వికాలంగత్వం అయితే లక్ష పొందవచ్చన్నారు. ఈనెల చివరలోగా అందరూ సురక్ష యోజన బీమా చేయించుకోవానలి సూచించారు.

పాఠశాల ప్రారంభం నాటికి జగనన్న విద్యాకానుక

బేతంచెర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులందరికీ జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభంనాటికి జగనన్న విద్యా కానుక అందజేయడానికి చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ సోమశేఖర్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం 1వ తరగతి నుంచి 10 వరతగతి విద్యార్థులకు సంబంధించి 96,215 గాను 44,435 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. ఈనెల చివరికి మిగిలిన పాఠ్యపుస్తకాలు వస్తాయన్నారు.

26న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు బుధవారం తెలిపారు. సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి తదితర వాటిపై సమీక్ష జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు. అలాగే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని సూచించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరించిన దృశ్యం

డోన్ : ప్రజలకు వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, కౌన్సిలర్లు టీఈ లక్ష్మీదేవి, సుకన్య పేర్కొన్నారు. 9వ సచివాలయం పరిధిలోని వలంటీర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. పదిమంది వలంటీర్లకు సేవా మిత్ర, ఒకరికి సేవావజ్ర పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు వలంటీర్లు నేరుగా సంక్షేమ ఫలాలు అందజేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. అర్హులందరికీ న్యాయం చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.

మోడల్ స్కూలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలోని గోరుమానుకొండ సమీపాన ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటరమొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రవేశం కొరకు జూన్ 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ షమీల తెలిపారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 150 చొప్పున ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశాలు పదవ తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం చేపడుతామన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో మొత్తం ఖాళీలు చూపించాలి

బనగానపల్లెరూరల్: ఉపాధ్యాయుల బదిలీల్లో మొత్తం ఖాళీలను చూపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి అధికారులను కోరారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలన్నారు. ప్రదోన్నతుల విషయంల ఉపాధ్యాయులను విల్లింగ్ లేదా నాట్‌విల్లింగ్ అడగడం ఎంత వరకు సమజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, లింగమయ్య, వెంకటకృష్ణుడు, సుబ్బరాయుడు, రమేష్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లె పట్టణంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీఆర్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరిగాయి.

సాగు రుణాలు.. సులభతరం!

- రైతులకు అండగా బ్యాంకులు
- రూ. 1.60 లక్షల వరకు రుణాలు
- తప్పనున్న ప్రైవేట్ అప్పుల భారం



సాగులో ఉన్న వేరుశనగ పంట(ఫైల్)

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. పెట్టుబడి సాయం(రైతుభరోసా)తోపాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేస్తుంది. అదేవిధంగా దిగుబడులకు మద్దతు ధర కల్పిస్తూ అండగా నిలుస్తుంది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో రైతన్నకు మరింత వెసలుబాటుగా బ్యాంకు రుణాలు అందజేసేందుకు చర్యలు చేపట్టింది. సాగుకు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోకుండా బ్యాంకుల ద్వారనే రుణాలు అందజేసేందుకు బ్యాంకర్లతో చర్చించి ప్రణాళికలు రూపొందించింది. ఈ నేపథ్యంలో 2023–24 సంవత్సరానికిగాను పంటల వారీగా రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రైతులు ఎటువంటి పూచీలేకుండా పంట రుణాలు పొందవచ్చు. బనాగానపల్లె నియోజకవర్గంలో 2.16 లక్షల ఎకరాలు సాగువిస్తీర్ణ ఉండగా 78.682 మంది రైతులు ఈ భూములను సాగు చేస్తున్నారు. వీరికి కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీ కూడా జరిగింది. ఈ కార్డుల ద్వారా ఎటువంటి పూచీలేకుండా 1.60 లక్షల వరకు ప్రతి రైతు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యాన్ని పొందవచ్చు.

సకాలంలో రుణాలు చెల్లిస్తే పూర్తిస్థాయిలో వడ్డీరాయితీ

అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేయాలన్న లక్ష్యంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందేందుకు అర్హులైన రైతుల గుర్తించినట్లు సమాచారం. ఈ కార్డుల ద్వారా గరిష్టంగా ఎలాంటి పూచీలేకుండా ప్రతి రైతుకు ఖరీఫ్, రబీ సీజన్‌లల్లో 1.60 లక్షల రుణసౌకర్యం కల్పిస్తారు. ఇందుకు కేవలం 7 శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తారు బ్యాంకు అధికారులు. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3 శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. రూ. లక్షలోపు రుణం ఏడాదిలోగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి పూర్తిస్థాయిలో మినహాయింపు పొందే అవకాశం ఉంది.

టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ

పంటల వారీగా రుణపరిమితి ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా అక్టోబర్ నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణప్రణాళిక అమలు చేయనున్నారు. ఏడాది కార్యచరణ ప్రణాళికను లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించారు. ఏ పంటకు ఎంత రుణం ఇవ్వలనే విషయమై నివేదికలు రూపొందించారు. ఈ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపగా అక్కడ ఆయా పంటలకు రుణప్రణాళికను విడుదల చేశారు. ఏడాదేడాదికి సాగు పెట్టుబడి, కూలీల ఖర్చులు పెరుగుతున్న తీరును పరిగణలోకి తీసుకున్నారు ఉన్నతాధికారులు. పంట రుణ పరిమితిని ఎకరాకి నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేయనున్నాయి.

రైతులకు ఇబ్బందులు తప్పుతాయి



ప్రభుత్వమే బ్యాంకర్ల ద్వారా తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తునందున ప్రైవేట్ వడ్డీ భారం తగ్గింది. బ్యాంకులు రైతులకు అనుగుణంగా రుణాలు అంజేయాల్సిన అవసరం ఉంది. బ్యాంకు రుణాలు మంజూరైతే సాగు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవు. ప్రైవేట్ వడ్డీల భారం లేనందున రైతుకు ఆదాయం పెరుగుతుంది.
– ఈశ్వర్‌నాయక్, రైతు, చిన్నరాజుపాళెంతాండా

అర్హులైన రైతులందరికీ రుణాలు



అర్హులైన రైతులందరికీ బ్యాంకర్ల ద్వారా రుణ సౌకర్యం అందజేయడం జరుగుతుంది. కిసాన్ క్రెడిట్ కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. రుణ సౌకర్యం పొందేందుకు అర్హులైన రైతులందరినీ గుర్తించడం జరిగింది. తీసుకున్న రుణం ఏడాదిలోగా చెల్లిస్తే వడ్డీ భారం తప్పుతుంది. రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఆశ్రయించి ఇబ్బందులు పడకుండా బ్యాంకుల్లో రుణాలు పొంది వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి.
– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె

డోన్ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: ఇంటర్ మీడియట్ ఫలితాల్లో అత్యధిక ఫలితాలు సాధించిన డోన్ ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు జూన్ 7లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ తెలిపారు. పదవ తరగతి పాసైన వారు డోన్ మండలానికి చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియం గ్రూపులు ఉన్నట్లు పేర్కొన్నారు.

6వ తరగతి ప్రవేశానికి చివరి తేదీ నేడే...

ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి గురువారం చివరి రోజు అని ప్రిన్స్‌పాల్ జాస్మిన్ తెలిపారు. ఇంతవరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు త్వరగా చేసుకోవాలని సూచించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

డోన్ టౌన్ : వాహనచోదకులు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ సూచించారు. బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. టోల్ గేట్ నుంచి డోన్ పట్టణం వైపు పెళ్లి బృందంతో వస్తున్న ఐచర్ వాహనం నిబంధనలు ఉల్లంఘించడంతో సీజ్ చేసి రూ. 23వేలు జరిమానా విధించామని ఆయన తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐచర్ వాహనం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపించడంతో రూ. 22వేలు, మరో ఆటోలో 15మంది ప్యాసింజర్లను ఎక్కించుకున్నందుకు రూ.7వేల జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

పశువులకు వైద్యసేవలు అందజేస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఏడీ మారుతీ సకారం, చిత్రంలో చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: పశువులు, జీవాలకు అన్నివిధాలా వైద్య సేవలు అందజేస్తామని, పాడిరైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశుసంవర్ధకశాఖ ఏడీ మారుతీ సకారం హామీ ఇచ్చారు. కొండమీది గ్రామాలైన ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె తదితర తండాల పాడి రైతులు, గొర్రె, మేకల పెంపకదారులు మూగజీవాలకు వైద్యసేవలు అందడం లేదని రెండురోజుల క్రితం వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు విఘ్నేశ్వర్ రెడ్డి సమస్యను ఏడీ వివరించి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఏడీ మారుతీ సకారం బుధవారం ఉప్పలపాడు చేరుకుని విఘ్నేశ్వర్‌రెడ్డితో సమస్యపై చర్చించారు. ఇక్కడి సిబ్బంది కొరత ఉందని, అయినా మూగజీవాలకు అన్నివైద్య సేవలు అందజేస్తామన్నారు. అనంతరం రైతులతో ఏడీ మాట్లాడుతూ వారంలో రెండు రోజుల పాటు ఇక్కడ సిబ్బంది ఉంటారని, చికిత్స క్యాంపులు కూడా ఏర్పాటు చేస్తామని, అందుకు అనుగుణంగా పశుపోషకులు సహకారం అందజేయాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం ద్వారా క్యాంప్‌ను ఏర్పాటు చేసి, పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తస్లీమ్, ఏహెచ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



వెంకటాపురంలో వలంటీర్లను సత్కరించిన దృశ్యం



వలంటీర్లను సత్కరిస్తున్న కౌన్సిలర్ నాగేంద్ర

డోన్ టౌన్ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న సంక్షేమ సారథులు వలంటీర్లు అని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం వెంకటాపురం, ఉడుములపాడు గ్రామ సచివాలయాల్లో ఉత్తమ వలంటీర్లను వారు సన్మానించారు. శాలువాలు కప్పి ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. ప్రత్యేకించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఒటవ తేదీనే లబ్ధిదారులు గడప దాటకుండా ఇళ్ల వద్దకే వెళ్లి నగదు అందజేస్తున్న సేవ వెలగట్టలేనిదన్నారు. ఇప్పటికే వలంటీర్లు అందరి మన్ననలు పొందుతున్నారని, మరింత ప్రజలకు చేరువ కావాలని సూచించారు.

పట్టణంలో

పట్టణంలోని 13వ వార్డు సచివాలయంలో కౌన్సిలరు దినేష్‌గౌడ్, 10, 16, 17వ సచివాలయాల్లో కౌన్సిలర్ నాగేంద్ర ఉత్తమ వలంటీర్లను సన్మానించారు. శాలువాలు కప్పి ప్రశంసా పత్రాలతో సత్కరించారు కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ వరప్రసాద్, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, ఎంపీటీసీలు సుమిత్రమ్మ, రామలక్ష్మి, సర్పంచ్‌లు రాణి తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం



క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్ల దృశ్యం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని సాక్షి నివాస్ మీదుగా వెంకటానాయునిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి క్షుద్ర పూజలు చేసినట్లు పట్టణంలో కలకలం రేగింది. బుధవారం ఉదయం అటుగా మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వ్యక్తులు గమనించి భయాందోళనకు గురయ్యారు. సాక్షి వెంచర్‌లోని ఒక ప్రాంతంలో గుమ్మడికాయ బలిహరణ చేసి నిమ్మకాయలు కోసి ఆకు, వక్కలు, ఊది బత్తీలు, బట్టలు,(చీర)కత్తి, నీటి బిందెతో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి.

ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

నంద్యాల (న్యూ టౌన్) : ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ సేవలు స్థానిక కార్యాలయంలో ప్రారంభించినట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అజం బేగ్, మౌలాలి బుధవారం తెలిపారు. రాష్ట్ర సహాయ అధ్యక్షులు చంద్రశేఖర్, గోపాల కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సేవలందించేందుకు యూనియన్ ఎల్లప్పుడు ముందుంటుందని చెప్పారు. బదిలీల ప్రక్రియ ముగిసేవరకు సేవలు కొనసాగుతాయని చెప్పారు. ఉపాధ్యాయులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాగేంద్ర కుమార్, వీరప్ప, రంగ స్వామి, నాగేశ్వర రెడ్డి, చంద్రశేఖర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు ప్రత్యేక ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ షఫీ

డోన్ టౌన్: ఇతర రైతుల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న కౌలు పత్రాలు పొందితే ప్రత్యేక ప్రయోజనాలు ఉంటాయని ఏఓ లబ్బుల్ షఫీ తెలిపారు. మండలంలోని ఎద్దుపెంట, చనుగొండ్ల, కొత్రాయి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఏఓ కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారిని కలిసి తమ పేర్లు నమోదు చేసుకుంటే కౌలు రైతు పత్రం అందజేస్తామన్నారు. ఈ పత్రం పొందిన కౌలు రైతులు పంట నమోదు, పంటల బీమా చేసుకోవచ్చని, పంటలు దెబ్బతింటే పంట నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. వేరు శనగ సాగు చేసే రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలకు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం



జ్యోతులను తల పై పెట్టుకొని శ్రీ చౌడేశ్వరిదేవి భక్తి గీతాలు ఆలపిస్తున్న తోగట వీరక్షత్రియులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బనగానపల్లెరూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి తిరుణాల మహోత్సవంలో భాగంగా బుధవారం జ్యోతి ఉత్సవం వైభవంగా జరిగింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత జ్యోతి ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో గ్రామంలో సందడి నెలకొంది. బంధువులు, స్నేహితుల రాకతో ప్రతి ఇల్లు కలకలలాడింది. మార్కెండయస్వామి దేవాలయం వద్ద ఙమంగళవారం అర్ధరాత్రి తోగటవీరక్షత్రియులు సుమారు 22 జ్యోతులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జ్యోతులను తలపై పెట్టుకుని అమ్మవారి భక్తి గీతాలు ఆలపిస్తూ సాగిన ఊరేగింపు బుధవారం ఉదయం చౌడేశ్వరిదేవి ఆలయానికి చేరింది. మైలవరం కృష్ణుడు బృందం ప్రదర్శించిన చక్కభజన గేయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం తోగటవీరక్షత్రియులు శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించారు. అదేవిధంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవంతో జ్యోతి ఉత్సవాలు ముగుస్తాయని గ్రామపెద్దలు తెలిపారు.

భగవంతుని నామస్మరణతో ముక్తి



పూదోట ఆశ్రమంలో జరిగిన విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: భగవంతుని నామస్మరణతో ముక్తి కలుగుతుందని పూదోట ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, భజన కృష్ణయ్య, డాక్టర్ నరసింహులు తెలిపారు. లోక కళ్యాణర్థం పూదోట ఆశ్రమంలో చేపట్టిన విష్ణు సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం బుధవారం కొనసాగింది. పారాయణంలో భక్తులు పాల్గొని భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలని వారు పిలుపునిచ్చారు. జూన్ 30 వరకు కొనసాగే ఈ పారాయణంలో భక్తులకు అన్నదానం చేసేందుకు కొందరు దాతలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో దాతలు కందగడ్డల మోహన్‌రావు, దామోదరయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమాంబేశ్వరి ఆలయ వార్షికోత్సం



పూజలు చేస్తున్న భక్తులు

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీఎల్లమాంబేశ్వరి దేవి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జైగౌడ రాష్ట్రనాయకులు మద్దిలేటిగౌడ్, తాలూకా కార్యదర్శి రంగన్నగౌడ్, కోశాధికారి వెంకటేశ్వర్లు, శ్రీశైలం దేవస్థానం అమ్మవారి ఉపాసకులు ఉదయ నరసింహరాజునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కమలాపురం బొబ్బల శివరామిరెడ్డితోపాటు రాష్ట్రగౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం అభివృద్ధికి కొందరు దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు తెలిపారు.

పంట సాగుదారు హక్కు పత్రం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ రావు

అవుకు: కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే పంటసాగుదారు హక్కు పత్రం తప్పనిసరిగా ఉండాలని ఏఓ ప్రసాద్ రావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మెట్టుపల్లె రైతుభరోసా కేంద్రాంలో ఏఓ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌లో కౌలు సాగు చేసుకునే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి పంట సాగుదారు హక్కు ప్రతం మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంటనష్టం కలిగిన, బ్యాంకుల నుండి రుణాలు పొందాలన్నా, ప్రభుత్వ గిట్టుబాటు ధరకు దిగుబడిని అమ్ముకోవడానికి ఈ పత్రం ఉంటేనే అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో వీఏఏ మహేంద్ర, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌తో పంటపొలంలో దుక్కులు దున్నుతున్న రైతన్న

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్న

బేతంచెర్ల: ఖరీఫ్ సాగుకు రైతన్న సిద్ధమవుతున్నాడు. వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ అయ్యాడు. దుక్కిదున్ని పొలాలను సన్నద్ధం చేస్తున్నారు. జొన్న, కంది కొయ్యలను తొలగిస్తున్నారు. మండలంలో దాదాపు 14వేల హెక్టార్ల సాగుభూమి ఉంది. దాదాపు 70 శాతం వర్షాధారిత భూములు. కేవలం 30 శాతం నల్లరేగడి ఉండగా 70 శాతం ఎర్రమట్టి, ఇసుక నేలలు ఉన్నాయి. ఎర్రమట్టి నేలల్లో కంది, వేరుశనగ, కొర్ర, సజ్జ పంటలను సాగు చేస్తారు.



జొన్నకొయ్యలను తొలగిస్తున్న వ్యవసాయ కూలీలు